# ఘనంగా మహాదేవ స్వామికి ఉగాది అమావాస్య పూజలు

డి.హిరేహాళ్ మార్చి 18 ప్రభాతవార్త


మహాదేవస్వామి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న కాపు రామచంద్రారెడ్డి

రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు, ఓ బి సి యువ మోర్చా రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు, కాపు రామచంద్రారెడ్డి తన అన్యాయులతో కలిసి శివలింగ స్వామి ఆలయంలో ఉగాది అవమావాస్య పూజలు ఘనంగా చేయించారు. బుధవారం ఆయన బళ్లారి పట్టణం అల్లిపురం మహదేవస్వామి ఆలయంలో ఆయన తన ముఖ్య అనుచరులు రాళ్ల తిమ్మారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, మైనార్టీ నాయకుడు ఖాసింపీర, వెంకటేశ్వరరెడ్డి తదితరులతో కలిసి మహాదేవ స్వామివారికి కాపు ప్రత్యేక పూజలు చేయించారు. తమిళనాడు ఎన్నికల ప్రచారం అనంతరం కాపు మంగళవారం రాత్రి బళ్లారి పట్టణం కు చేరుకుని తమిళనాడులో సైతం బిజెపి పార్టీ విజయపతాకం ఎగర వేయాలని కాపు మహాదేవ స్వామి కి పూజలు చేయించినట్లు తన అన్యాయులు తెలిపారు. భారత దేశవ్యాప్తంగ బిజెపి గెలవాలన్న సంకల్పంతో కాపు అహర్నిషలు కృషిచేస్తూ ప్రచార సభల్లో పాల్గొంటున్నట్లు కాపు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో రాయదుర్గం నియోజకవర్గం లో కూటమి ప్రభుత్వంలో బిజెపి కమలం గుర్తు పతాకాన్ని ఎగరవేయడమే తన లక్ష్యమని, తన సంకల్పమని తాను ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతూ బిజెపి గెలుపుకు కృషి చేస్తున్నట్లు కాపు తెలిపారు. రాబోవు రోజుల్లో కూటమి ప్రభుత్వం సహకారంతో బిజెపి కమలం గుర్తును ఎగరవేసి అనంత జిల్లా స్థాయిలో భాజాపా ఎంపీ, రాయదుర్గం నియోజకవర్గంలో బాజాపా ఎమ్మెల్యే కొనసాగుతు ఇటు ఆంధ్ర, ఆటో కర్ణాటక రాష్ట్రాల్లో ఆధిపత్యం కొనసాగిస్తామని కాపు దీమా వ్యక్తం చేశారు.

# డీలర్ల ద్వారానే గ్యాస్ సిలిండర్ల సరఫరా

హిందూపురం టౌన్ మార్చి 18 ప్రభాతవార్త

హిందూపురం పట్టణంలోని అధికారిక డీలర్ల ద్వారానే గ్యాస్ సిలిండర్ల సరఫరా జరుగుతుందని హిందూపురం మండల తాహసిల్దార్ వెంకటేశు ఒక ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు పట్టణంలోని గ్యాస్ ఏజెన్సీలను అధికారులు రద్దు చేశారని తమ వద్ద గ్యాస్ సిలిండర్లు తీసుకోవాలని అపోహలు సృష్టిస్తున్నారంటూ తెలిపారు. ప్రజలు వీటిని నమ్మవద్దని హిందూపురం పట్టణంలోని అధికారిక గ్యాస్ ఏజెన్సీలైన మనోజ్ ఇండెన్ సర్వీస్, పిఎస్ఎన్ఆర్ కంబైన్స్, తదితర గ్యాస్ ఏజెన్సీలద్వారానే గ్యాస్‌బుకింగ్ చేసుకోవాలని తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తుల మాటలు నమ్మి ప్రజలు ఇబ్బంది పడకూడదని తెలిపారు.

# రైతులు ఆధునిక సాంకేతిక శాస్త్రీయ విధానాల పట్ల అవగాహన పెంపొందించుకోవాలి

**తక్కువ ఖర్చుతో ఎక్కువ పల సాయం సాధించే విధానాలను తెలుసుకోవాలి**

**బి.కొత్తూరు గ్రామంలో రైతన్నా! మీ కోసం" కార్యక్రమం**


కుందుర్పి మండలంలో రైతన్న-మీకోసం కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

కుందుర్పి (కళ్యాణదుర్గం), మార్చి 18 ప్రభాతవార్త:

గ్రామీణ ప్రాంతాల రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకుని సాంకేతిక వ్యవసాయాన్ని అలవర్చుకోవాలని కుందుర్పి మండల వ్యవసాయ అధికారి విజయకుమార్ తెలిపారు. వ్యవసాయ ఖర్చులను తగ్గిస్తూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు అందించే సాగు విధానాలను అనుసరించాలని ఆయన సూచించారు. బుధవారం మండల పరిధిలోని బసాపురం గ్రామపంచాయతీకి చెందిన బి.కొత్తూరు గ్రామంలో రైతన్నా - మీ కోసం" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వర్ణాంధ్ర2047 లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తున్నారని తెలిపారు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు నియోజకవర్గంలో రైతు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ పలు కార్యక్రమాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. ఆయన ఆదేశాల మేరకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయంలో డీప్‌టెక్, కృత్రిమ మేధస్సు (ఏఐ), ఐఓటీ, డ్రోన్లు, రోబోటిక్స్, ఉపగ్రహ సాంకేతికతలను వినియోగంలోకి తీసుకువచ్చి వ్యవసాయాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఎన్డీఏ కూటమి పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కుందుర్పి మండల టీడీపీ అధ్యక్షుడు ధనుంజయ, క్లస్టర్ ఇన్‌చార్జ్ శివలింగప్ప, గ్రామ కమిటీ అధ్యక్షుడు మర్రిస్వామి, మండల ప్రధాన కార్యదర్శి బసాపురం నాగరాజు, సింగిల్ విండో డైరెక్టర్ కొలిమిపాళ్యం గోవిందప్ప, ఈరన్నతో పాటు టీడీపీ నాయకులు రంగప్ప, పెద్దన్న, బొమ్మలింగప్ప, తిప్పేస్వామి, శ్రీనివాసులు, గోపాలప్ప, నవీన్‌కుమార్, రాకేష్, విష్ణు, జయ రాములు, శ్రీరాములు, గిడ్డ హనుమప్ప, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు. మహిళా రైతులు లక్ష్మక్క, కవితమ్మ, దురుగమ్మ, బుడ్డమ్మ, జ్యోతి, అనితమ్మ, చిట్టెమ్మ, వన్నూరక్క, తిమ్మక్క, కరియమ్మ, లలితమ్మ తదితరులు హాజరయ్యారు.

# ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య


మృతుడు నరసింహ (ఫైల్)

కంబదూరు, మార్చి 18, ప్రభాత వార్త

కంబదూరు మండల కేంద్రంలో బుధవారం విషాదకర ఘటన చోటు చేసుకుంది. భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి కాపురానికి రాకపోవడంతో మనస్థాపానికి గురైన నరసింహ (45) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై లోకేష్ తెలిపిన వివరాల మేరకు, మఠం బండ సమీపంలో నివసిస్తున్న నరసింహ, భాగ్యలక్ష్మి దంపతుల మధ్య కొద్దిరోజుల క్రితం గొడవ జరిగింది. దీంతో భార్య పుట్టింటికి వెళ్లింది. ఆమె తిరిగి రాకపోవడంతో మనస్తాపానికి గురైన నరసింహ, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్ కు ఉరి వేసుకుని ఈ దుర్ఘటనకు పాల్పడ్డాడు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

# నవోదయ ఫలితాల్లో...మారుతి విద్యా మందిర్ విద్యార్థి ప్రతిభ

**కంబదూరు, మార్చి 18, ప్రభాత వార్త :** కంబదూరు మండల కేంద్రానికి చెందిన వడ్డే మారుతి ప్రసాద్ కుమారుడు తరుణ్ తేజ్ అనే విద్యార్థి నవోదయ ఫలితాల్లో సత్తా చాటాడు. మండల కేంద్రంలోని మారుతి విద్యా మందిర్ లో 5 వ తరగతి చదువుతున్న విద్యార్థి తరుణ్ తేజ్ ఇటీవల నవోదయ 6 వ తరగతి ప్రవేశ పరీక్ష రాశాడు. మంగళవారం విడుదలైన నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో 90 మార్కులు సంపాదించి 00121 ర్యాంకుతో ఉత్తీర్ణత సాధించాడు. నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబరిచి చదువుకుంటున్న పాఠశాలకు మంచి పేరు తీసుకురావడంతో ఆ పాఠశాల యాజమాన్యం, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థికి శుభాకాంక్షలు తెలిపారు. చదువు విషయంలో ప్రోత్సాహాన్ని అందించిన విద్యార్థి తల్లిదండ్రులను పాఠశాల యాజమాన్యం అభినందించింది.

# దివ్యాంగులకు ఉచిత ప్రయాణం ప్రారంభం


బస్సును ప్రారంభిస్తున్న నాయకులు

హిందూపురం మార్చి 18 ప్రభాతవార్త

నూతనంగా దివ్యాంగ శక్తి పథకం ప్రభుత్వం ఏర్పాటు చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం ప్రారంభించిన క్రమంలో హిందూపురంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. మున్సిపల్ తాజా మాజీ చైర్మన్ రమేష్ కుమార్, ఎమ్మెల్యే పి ఎ బాలాజీ ముఖ్య అతిథులుగా హాజరై దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. దివ్యాంగులతో పాటు వారి సహాయార్థం ప్రయాణించే వారికి కూడా టికెట్ లో 50 శాతం రాయితీ సౌకర్యం ప్రభుత్వం కల్పించినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టిసి అధికారులు, సిబ్బంది, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# పన్ను చెల్లించి వడ్డీ రాయితీ పొందండి

హిందూపురం మార్చి 18 ప్రభాతవార్త

హిందూపురం మున్సిపాలిటీలో ఖాళీ జాగాలు, నిర్మాణాలకు సంబంధించిన పన్ను బకాయిలను వెంటనే చెల్లించి వడ్డీ లో 50 రాయితీ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కమిషనర్ మల్లికార్జున తెలిపారు. వడ్డీపై 50శాతం పన్నురాయితీ గడువుఈనెల31తో ముగియనుందని, ఈతేదీకి పొడిగింపు ఉండదని స్పష్టం చేశారు. కావున పన్ను చెల్లింపుదారులు పన్ను 100 క్లియర్ చేయాలనికోరారు. మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కౌంటర్లలో కానీ లేదా మేళాపురం, టీచర్స్ కాలనీ, శ్రీకంఠపురం, చిన్నమార్కెట్ ప్రాంతాల్లో ఉన్న సచివాలయాల్లో పన్నులు చెల్లించవచ్చని అన్నారు. పురసేవ యాప్ లేదా సిడిఎంఏ వెబ్ సైట్ ద్వారా ఆన్లైన్లో కూడా చెల్లింపులు చేయవచ్చని తెలిపారు.

# పాఠశాలలో నూతన అడ్మిషన్ లు ప్రార్మంభించిన ఉపాధ్యాయుడు సాయిరాం

బ్రహ్మసముద్రం మార్చి 16 ప్రభాతవార్త


అడ్మిషన్ కోసం వెళ్తున్న దృశ్యం

మండల పరిధిలోని పాలవెంకటాపురం పైదొడ్డి యం పి పి పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను నూతన అడ్మిషన్ల నమోదు కార్యక్రమం నేడు చేయడం జరగిందని ప్రధానోపాధ్యాయుడు సాయిరాం తెలిపారు ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల కోసం కూటమి ప్రభుత్వం ఇంట్లో ఉన్న పిల్లలు అందరికి అమ్మకువందనం, రుచికరమైన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనపథకం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ డిజిటల్ బోధన, ఇంగ్లీష్ మీడియంలో బోధన, నిరంతర అధికారులు పర్యవేక్షణ, తదితర సేవలు గూర్చి వివరించి, ప్రభుత్వ పాఠశాలల్లో నైపుణ్యాధారిత బోధన, సృజనాత్మక కార్యక్రమాలు, డిజిటల్ పద్ధతులు, విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇవ్వడం జరగిందని తెలిపారు ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయుడు సాయిరాం ఉపాధ్యాయులు శ్రీరాములు, యస్ యం సి చైర్మన్ నగేష్ తదితరులు పాల్గొన్నారు

# నవోదయ ఫలితాల్లో గ్రామీణ విద్యార్థి ప్రతిభ

కణేకల్ మార్చి 18 ప్రభాతవార్త



మండలంలోని అంబాపురం గ్రామానికి చెందిన విద్యార్థి స్నితిక్ నవోదయ విద్యాలయ సమితి నిర్వహించిన ఆరవ తరగతి ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి 41వ ర్యాంక్ సాధించాడు. డిసెంబర్‌లో జరిగిన ఈ పరీక్షల్లో అతని ప్రతిభ గ్రామీణ విద్యార్థుల సామర్థ్యాన్ని మరోసారి చాటిచెప్పింది. స్నితిక్ తండ్రి గొల్ల రామకృష్ణ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తుండగా, తల్లి లక్ష్మి గృహిణిగా కుటుంబాన్ని పోషిస్తూ కుమారుడి విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ప్రస్తుతం అతడు అంబాపురం ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్నాడు. చదువుపై ఆసక్తి, పట్టుదలతో ముందుకు సాగుతున్న స్నితిక్‌ను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించడంతో నవోదయ ప్రవేశ పరీక్షల్లో ఈ విజయాన్ని సాధించాడు. పరిమిత వనరుల మధ్య కృషి చేసి మంచి ఫలితం సాధించడం విశేషంగా నిలిచింది. విద్యార్థి విజయంపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# వైభవంగా శ్రీ అక్కమ్మ దేవతల జాతర ఏర్పాట్లు

**భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలి**

**టిడిపి యువ నేత దేవినేని ధర్మతే**

కళ్యాణదుర్గం, మార్చి 18 ప్రభాతవార్త


అక్కమ్మ జాతర ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న దృశ్యం

తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినానంతరం కళ్యాణదుర్గం పట్టణంలో నిర్వహించే శ్రీ అక్కమ్మ దేవతల జాతర భక్తి శ్రద్ధల నడుమ ప్రతి ఏడాది వైభవంగా జరుగుతుంటుంది. గ్రామీణ ప్రాంతాలతో పాటు పొరుగు కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా వేలాదిగా భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటారు. ఈ పవిత్ర జాతరను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సూచనల మేరకు, ఆయన అందుబాటులో లేకపోయినప్పటికీ తెలుగుదేశం పార్టీ యువనేత ధర్మతేజ బాధ్యతలు చేపట్టి ఆలయ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించారు. భక్తులకు అమ్మవారి దర్శనం సులభంగా, సౌకర్యవంతంగా జరిగేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. దర్శనానికి వచ్చే భక్తులు మరియు పానకాలు సమర్పించే వ్రతభక్తుల కోసం వేరువేరు బారికేడింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. దీంతో అమ్మవారి సేవలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడవచ్చని పేర్కొన్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఆలయం గర్భగుడిలో భక్తులు ఉక్కపోతకు గురికాకుండా ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జాతరకు విచ్చేసే భక్తులకు తాగునీటి కొరత లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. విద్యుత్ అంతరాయాలు కలగకుండా జనరేటర్లు సిద్ధంగా ఉంచాలని అధికారులకు తెలిపారు. అలాగే వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ధర్మతేజ వెల్లడించారు. భక్తులు ఆధ్యాత్మిక ఆనందంతో అమ్మవారిని దర్శించుకునేలా అన్ని ఏర్పాట్లు చేయడం తమ లక్ష్యమని అన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ మహిళా చైర్మన్ పద్మావతి, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ వై.పీ. రమేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మీదేవి, సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు పలు సూచనలు చేశారు.

# గోరంట్ల మండల వాసులకు ...ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ

గోరంట్ల, మార్చి 18 ప్రభాతవార్త


చెక్కులు అందజేస్తున్న మంత్రి సవితమ్మ

గోరంట్ల మండలంలోని ఏడు గ్రామాలకు చెందిన బాధిత కుటుంబాలకు మంత్రి సవితమ్మ చేతుల మీదుగా బుధవారం 4.49 లక్షల విలువచేసే చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి సమక్షంలో గోరంట్లకు చెందిన నాగేంద్రకు 55,250 రూపాయలు, ఆదిలక్ష్మమ్మకు 25,341, ఈశ్వరమ్మకు 57,200, పెరుమాళ్ళపల్లికి చెందిన షమీవుల్లాకు 35,786, మల్లాపల్లి గ్రామానికి చెందిన కిష్టప్పకు 42,614, రాగిమేకలపల్లి గ్రామానికి చెందిన అశ్వర్థకు 1.63 లక్షలు, మల్లాపల్లి గ్రామానికి చెందిన సతీష్‌కు 69 వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను మంత్రి కార్యాలయంలో బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**- కోడిపల్లిలో రైతన్న మీకోసం కార్యక్రమం**

లేపాక్షి, మార్చి 18 ప్రభాతవార్త


రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతి అని, సాగును లాభసాటిగా మార్చేందుకు ప్రభు త్వం అన్ని విధాలా కృషి చేస్తోందని లేపాక్షి మండల టిడిపి కన్వీ నర్ అభిలాష్ పేర్కొ న్నారు. బుధవారం మండల పరిధిలోని కోడిపల్లి గ్రామంలో వ్యవసాయశాఖ అధికారి శ్రీలత ఆధ్వర్యంలో "రైతన్న మీకోసం" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన డ్రిప్ పరికరాలు, వ్యవసాయ పనిముట్లను రాయితీపై అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 13న రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు నేరుగా రైతుల ఖాతాల్లోకి నగదు జమ చేశాయని గుర్తుచేశారు. సాగు ఖర్చులు తగ్గించి, దిగుబడి పెంచేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్నారు. అనంతరం నాయకులు, అధికారులు గ్రామంలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, రైతు సేవా కేంద్రం ప్రతినిధులు, కోడిపల్లి తెదేపా నాయకులు పాల్గొన్నారు.

# పల్లెలో పుట్టాడు.. ఢిల్లీలో పిహెచ్‌డి చేశాడు.. సీఎం చంద్రబాబును కలిశాడు

అగళి, మార్చి 18 ప్రభాతవార్త


పిహెచ్‌డి చేసిన విద్యార్థి చంద్రబాబునాయుడుని కలిసిన దృశ్యం

మండల పరిధిలోని ఇనగలూరు వల్లెటూరులో ఒక సామాన్య కూలీ కుటుంబంలో పుట్టిన దేవరాజ్ గల్లి నుంచి ఢిల్లీ యూనివర్సిటీకి వెళ్లి సోషియాలజీ సబ్జెక్టులో పిహెచ్‌డిని పొందడం గర్వించ దగ్గ విషయం. పిహెచ్‌డి సాధించిన దేవరాజు బుధవారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోపాటు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ కలిశారు. వారు ఈ సందర్భంగా ముగ్గురు అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యత కలిగిన కుటుంబంలో పుట్టి దేశ రాజధాని ఢిల్లీ సెంట్రల్ యూనివర్సిటీలో పిహెచ్‌డి పొందినందుకు సదరు విద్యార్థి దేవరాజ్‌ను అభినందించారు. మీరు పిహెచ్‌డి పొందడం పలువురికి ఆదర్శమన్నారు. జిల్లా కేంద్రానికి, నియోజకవర్గ కేంద్రానికి, రాష్ట్ర రాజధానికి మారుమూల విసిరేసినట్లు, కర్ణాటక సరిహద్దులో అగళి మండలంలోని చిన్న పల్లెటూరులో పుట్టి పిహెచ్‌డి పొందడం అర్పించ దగ్గ విషయమన్నారు.

# సకాలంలో పన్నులు చెల్లించి అధికారులకు ప్రజలు సహకరించాలి




పన్నులు చెల్లించాలని కోరుతున్న అధికారులు.

అనంతపురం రూరల్, మార్చి 18 ప్రభాతవార్త

అనంత రూరల్ మండలం కక్కలపల్లి కాలనీ గ్రామపంచాయతీలో నివసించే ప్రజలు, పంచాయతీ పరిధిలో ఉన్న కళాశాల లు, పాఠశాలలు, అపార్ట్మెంట్ యజమానులు సకాలంలో పన్నులు చెల్లించి అధికారులకు సహకరించడంతో పాటు పంచాయతీ, మండల అభివృద్ధికి పాటుపడాలని డి పీ ఓ నాగరాజు నాయుడు, డి యల్ పీ ఓ విజయ్ కుమార్, ఎంపీడీవో దివాకర్, డిప్యూటీ ఎంపీడీవో వెంకట నాయుడు, గ్రేడ్ 1 పంచాయతీ అభివృద్ధి అధికారి హిదయాతుల్లా, కుడిమి పంచాయతీ అభివృద్ధి అధికారి సురేంద్ర కోరారు. బుధవారం వారు గ్రామం లో ఇంటి పన్నులు చెల్లించని వారి వద్దకు వెళ్లి పన్ను లు చెల్లించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న పన్నులు సకాలంలో వసూలు చేయించాలని కమిషనర్, కలెక్టర్ మాకు దేశాలు ఇవ్వడం జరిగిందని వారి ఆదేశాల మేరకు గ్రామంలో ఎవరైనా ఇంకా ఇంటి పన్ను నీటి పన్ను చెల్లించని వారు ఉంటే పన్నులు చెల్లించి పంచాయతీ, మండల అభివృద్ధికి తోడ్పడాలని వారు గ్రామ ప్రజలను, ప్రైవేట్ కళాశాలలో పాఠశాలల ప్రిన్సిపాల్ లు, అపార్ట్మెంట యజమాలను కోరారు. గ్రామాలలో మోలిక సదుపాయాలు కల్పించాలన్న, గ్రామాన్ని కాని మందాలన్ని అభివృద్ధి చేయాలన్న ప్రజలందరూ సకాలంలో పన్నులు చెల్లిస్తేనే అభివృద్ధి పనులు చేయడానికి వీలుంటుందని కావున పన్నులు చెల్లించాలని పాఠశాల యజమానులను వారు కోరారు. ఇంకా ఎవరైనా ఇంటి, నీటి, ఇతర పనులు చెల్లించకపోతే తప్పకుండా చెల్లించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పన్ను వసూలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు సంవత్సరాది ఉగాది అందరికీ శుభాలు చేకూర్చాలి

**-రాష్ట్ర శాసన మండలి సభ్యులు వై.శివరామిరెడ్డి**

ఉరవకొండ, మార్చి 18 ప్రభాతవార్త



తెలుగు సంవత్సరాది పరాభవనామ ఉగాది పండుగ ప్రజలందరికీ శుభాలు చేకూరాలని రాష్ట్ర శాసన మండలి సభ్యులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వై.శివరామిరెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఒక ప్రకటనను విడుదల చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలు మాత్రమే జరుపుకునే అచ్చమైన తెలుగు పండుగ ఉగాది అని రెండు తెలుగు రాష్ట్రాల్లో తెలుగు వాకిలన్నీ పండుగ శోభతో కళకళలాడుతూ తెలుగుదనం ఉట్టిపడేలా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఉగాది అందరి జీవితాల్లో సుఖశాంతులు నింపి ఆయురారోగ్యాలను ప్రసాదించి సకాలంలో వర్షాలు కురిపించి పాడి పంటలు సంవృద్ధిగా ఉండేలా కలిసి రావాలన్నారు. ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఎడా పెడా విద్యుత్ కోతలతో సతమతం..!

**-సరఫరా ఎప్పుడు ఉంటుందో ఎప్పుడు పోతుందో తెలియని దుస్థితి**

**-తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఉరవకొండ, పరిసర ప్రాంత ప్రజలు**

**-వేసవి ప్రారంభంలోనే ఇలా ఉంటే మే, జూన్‌లో పరిస్థితి ఏంటో?**

**-ప్రజాప్రతినిధులైన సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని వేడుకోలు**

ఉరవకొండ, మార్చి 18 ప్రభాతవార్త



ఉరవకొండలో విద్యుత్ సరఫరాలో అధికమైన అంతరాయంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరఫరా ఎప్పుడు ఉంటుందో..ఎప్పుడు పోతుం దో కూడా తెలియని దుస్థితి ఇక్కడ నెలకొంది. పగలు, రాత్రి అన్న తేడా లేకుండా గంటల తరబడి సరఫరా నిలిచిపోతోంది. రోజుకు పదుల సార్లు సరఫరా నిలిచిపోతుండం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఉరవకొండలో విద్యుత్ సరఫరాలో సమస్యలు చాలా కాలంగా ఉన్నా ఇటీవలి కాలంలో అధికమవుతున్నాయని మండిపడుతున్నారు. వేసవి ప్రారంభం మార్చి నెలలోనే పరిస్థితి ఇంత అధ్వాన్నంగా ఉంటే ఏప్రిల్, మే, జూన్ నెలల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అధికారికంగా కరెంటు కోతల సమయాలు ప్రకటించి సరఫరా నిలిపి వేసినా సరిపోతుందని ఉన్నఫలంగా నిలిపివేస్తే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. మార్చిలోనే ఎండలు మండిపోతున్నాయని బయట ఎండ వేడిమి తట్టుకోలేక ఇంటికి వచ్చి ఫ్యాన్లు, ఏయిర్ కూలర్లు ఆన్ చేసుకొని కొద్దిసేపు సేద తీరుదామంటే కరెంటు సరిగ్గా ఉండటం లేదని వాపోతున్నారు. ఇక విద్యుత్ సరఫరాతో నడిచే కూల్ డ్రింక్ షాపులు, ఐస్‌క్రీం పార్లర్లు, ఇతరత్రా వాణిజ్య సముదాల పరిస్థితి దారుణంగా ఉంటోంది. వ్యాపారులు దెబ్బతిని నష్టపోవాల్సి వస్తోందని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంతకి ఉరవకొండలో అర్ధాంతరంగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడానికి కారణాలేంటో, వాటిని ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్థం కావడం లేదంటున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయంపై ప్రజా ప్రతినిధులు స్పందించి మెరుగైన విద్యుత్ సరఫరా జరిగేలా అవసరమైన చర్యలు తీసుకునేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

# గుత్తి డిప్యూటీ తహశీల్దార్‌కు అవార్డు

గుత్తి, మార్చి 18 ప్రభాతవార్త


కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న దృశ్యం

గుత్తి పట్టణంలో ఇటీవల జరిగిన గుత్తి కోట ఉత్సవా ల్లో తన విధి నిర్వహణలో ప్రతిభ కనబరచినందుకు జిల్లా కలెక్టర్ ఆనంద్ చేతుల మీదుగా స్థానిక డిప్యూటీ తహశీ ల్దార్ సూర్యనారాయణ అవార్డుతో పాటు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. రెండు రోజుల పాటు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ నేపథ్యంలో రెవెన్యూ విభాగంలో సూర్యనారాయణ అంకితభావంతో తన విధులు నిర్వహించారు. అదేవిధంగా కోట ఉత్సవాలను జయప్రదం చేసేందుకు కృషి చేసిన మున్సిపల్ కమీషనర్ జబ్బార్‌మియా, డిఇ హేమచంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌బాషలకు జిల్లా కలెక్టర్ ప్రశంసాపత్రాలతో పాటు మెమొంటోలను అందచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, తదితరులు పాల్గొన్నారు.

# పుట్టపర్తి మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ గా ఆర్డీఓ సువర్ణ

ఆర్డీవో సువర్ణకు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మంత్రి పల్లె



పుట్టపర్తి టౌన్, మార్చి 18, ప్రభాతవార్త

పుట్టపర్తి మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ గా పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ బాధ్యతలు తీసుకున్నారు. మున్సిపాలిటీకి పాలకవర్గం గడువు నిన్నటితో ముగియడంతో బుధవారం మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ గా బాధ్యతలు స్వీకరించిన పుట్టపర్తి ఆర్డిఓ కు కమిషనర్ క్రాంతికుమార్ మున్సిపల్ అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. బాధితుల స్వీకరించిన ఆర్డీవోకు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డితో పాటు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రత్నప చౌదరి, వెంగళమ్మ చెరువు సహకార సొసైటీ అధ్యక్షులు శ్రీరామ్ రెడ్డి, టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ టిడిపి నాయకులు ఓబులేసు, గంగాధర్ నాయుడు, కృష్ణ ప్రసాద్, సురేష్ చౌదరి తదితరులు ఆర్డీవోను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ ఆర్డిఓ సువర్ణ మాట్లాడుతూ పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి సహాయ సహకారాలతో పుట్టపర్తి మున్సిపాలిటీ అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తానని తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రజలు తగిన సహాయ సహకారాలు అందించాలని అదేవిధంగా స్థానిక ప్రజాప్రతినిధులు ,మీడియా ప్రతినిధుల సూచన మేరకు అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని ప్రత్యేకంగా కోరారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసిన ఎమ్మెల్యే పరిటాలసునీత

ధర్మవరంటౌన్ , మార్చి 18 ప్రభాతవార్త



లబ్దిదారునికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పరిటాలసునీత

పట్టణంలోని 35వార్డుకు చెందిన చింతా లక్ష్మీనారాయణకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాలసునీత రూ.25వేల చెక్కును అందజేశారు. ప్రభుత్వం మంజూరు చేసిన చెక్కును బుధవారం ఆమె చేతులమీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కమతం కాటమయ్య, మహేష్‌చౌదరి, పణికుమార్, సంధారాఘవ, షెట్ చంద్ర, జింకా పురుషోత్తం, తోట నారాయణస్వామి, చింతపులుసుపెద్దన్న, భీమినేని ప్రసాద్ నాయుడు, సిబిఎన్ రామకృష్ణ, జింకల రాజన్న, కేశగాలశీనా, గోసలశ్రీరాములు, కిరోసిన్ పోతలయ్య, మునుస్వామి, ప్రభాకర్, గంగాధర పాల్గొన్నారు.

# రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని నిత్యవసర సరుకులు పంపిణీ

బుక్కపట్నం, మార్చి 18, ప్రభాతవార్త



నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తున్న జనసేన పార్టీ నాయకులు

మండల కేంద్రమైన బుక్కపట్నంలోని జనసేన పార్టీ కార్యాలయంలో నిరుపేదలైన ముస్లిం మైనార్టీలకు జనసేన పార్టీ యువ నాయకులు తోట అనిల్ కుమార్ సౌజన్యంతో నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. దాదాపు 25 నిరుపేద ముస్లిం కుటుంబాలకు ఈ నిత్యవసర సరుకులను పంపిణీ చేయడం జరిగింది. తన తల్లి తోట సరస్వతమ్మ జ్ఞాపకార్థం ఆమె పేరు పై ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలియజేశారు. హిందూ ముస్లిం సోదర భావంతో అన్నదమ్ములుగా మెలిగి దేశ సర్వమత సౌభ్రాతృత్వానికి బాసటగా నిలవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ముస్లింలకు రంజాన్ ముబారక్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు సాగునీటి సంఘం ఉపాధ్యక్షులు దేవిశెట్టి సంజీవ రాయుడు, చిప్స్ గురుమూర్తి, సత్తి, మన్సూర్, బోయపాటి సాయి, నారాయణ స్వామి, జంగం వెంకటేశు, నాయిని భాస్కర్, రాయల్ రమణ, దినేష్, గందోడి నాగ , జంగం వెంకటరాముడు, సత్య కుమార్, సూరి, ఈశ్వర్, శివయ్య, వహీద్, సుధీర్, హరి తదితరులు పాల్గొన్నారు.

# వడగండ్ల వానతో బొప్పాయి, దానిమ్మ, రాగి, వక్కపంటల అపార నష్టం

## ఆవేదనలో రైతులు

అమరాపురం మార్చి 18 ప్రభాతవార్త



పంట నష్టపోయిన రైతులు దృశ్యం

మండల పరిధిలో హేమావతి, కొర్రేవు, తదితర గ్రామాలలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వడగండ్ల వాన ద్వారా రైతుల పంటల అపార నష్టానికి దరి తీసింది. ముఖ్యంగా భారీ స్థాయిలో ఈదురు గాలులు, వడగండ్లు పడడం ద్వారా బొప్పాయి, రాగి, దానిమ్మ, ఒక్క చెట్ల ఆస్తినష్టం జరిగింది. హేమావతి గ్రామంలోపరమేశ్వర, మంజునాథ్, కోరేవు గ్రామానికి చెందిన గోపి అనే రైతుల బొప్పాయి పంట పొడగండ్లతో పూర్తిగా నేలకొరిగి అపార ఆస్తి నష్టం జరిగినట్లు రైతులు పేర్కొన్నారు. మంజునాథ్, అశ్వత్తప్ప అని రైతుల రాగి పంటతో పాటు వక్క చెట్లు నేల కూలినట్లు వాపోయారు. అదేవిధంగా నరసింహారాజు, రత్నమ్మ రామాంజప్ప, రామన్న రవికుమార్ అనే రైతుల దానిమ్మ పంట పూర్తిగా నష్టపోయి తీర ఇబ్బందులు పాలైనట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మంజునాథ్ దృష్టికి స్థానిక టిడిపి మండల క్లస్టర్ కన్వీనర్ కృష్ణమూర్తి మరియు రైతులు తీసుకెళ్లడంతో వ్యవసాయాధికారి మంజునాథ్, స్థానిక గ్రామ వ్యవసాయ అసిస్టెంట్ విద్య రైతుల పొలాలను సందర్శించి ఆస్తి నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి కృషి చేస్తామని వ్యవసాయ అధికారి తెలిపారు. ఈ సందర్భంగా వడగండ్ల వానతో వాస్తు నష్టం చోటు చేసుకున్న రైతులను ఆదుకోవాలని స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రభుత్వానికి విన్నవించారు.

# రైతులు అవగాహనతో ముందుకు వెళ్లాలి నాయకులు ,అధికారులు

సోమందేపల్లి మార్చి 18 ప్రభాతవార్త



మాగేచెరువు గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమం అధికారులు నాయకులు

రైతన్నలు పంటలు మార్పిడి ఎరువులు తదితర విషయాలపై అవగాహనతో ముందుకు వెళ్లాలని నాయకులు ,అధికారులు పేర్కొన్నారు బుధవారం మండలంలోని మాగే చెరువు గ్రామంలో రైతన్న మీకోసం వారోత్సవాల్లో భాగంగా మండల వ్యవసాయ అధికారిని శ్రీ.విజయభారతి హాజరై ఇంటింటికి వెళ్లి రైతన్న మీకోసం కార్యక్రమం 5 విధానాల గురించి అవగాహన కల్పించారు. నీటి భద్రత ,డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్కు, ఫుడ్ ప్రాసెసింగ్ ప్రభుత్వం నుంచి పూర్తి మద్దతు గురించి వ్యవసాయ, అనుబంధ శాఖలలో జరుగుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. అంతేకాకుండా ముఖ్యంగా అన్నదాత సుఖీభవ ,పీఎం కిసాన్‌తిశితి,లీలీ యాప్ ,ప్రకృతి వ్యవసాయం, ఎల్ నినో ప్రభావం వల్ల పరిస్థితులు ,పంటల సాగు వివరాలు మీద రైతులకు ఇంటింటికి వెళ్లి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ వెంకటేష్, మాజీ కన్వీనర్ సిద్ధలింగప్ప, రామకృష్ణ, సర్పంచ్ నరసింహులు, సింగిల్ విండో అధ్యక్షుడు పూల వెంకటేష్, ఏఈఓ అలేఖ్య, జుతితి గౌరీ ,లీశినివీ భావన, సెరికల్చర్ టెక్నికల్ అసిస్టెంట్ జయరాం, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# ఇంటర్ విద్యార్థులు 113 మంది పరీక్షకు గైర్హాజరు

కొత్తచెరువు మార్చి 18 ప్రభాతవార్త

శ్రీ సత్య సాయి జిల్లా లో 41 పరీక్ష కేంద్రాల యందు 20 వ రోజు ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయనీ డి ఐ ఈ ఓ చెన్నకేశవ ప్రసాద్ తెలిపారు . బుధవారం ద్వితీయ సంవత్సర విద్యార్థులకు కెమిస్ట్రీ పరీక్ష జరిగింది. జిల్లా వ్యాప్తంగా 6520 మంది విద్యార్థులకు గాను 6407 మంది విద్యార్థులు హాజరు అయ్యారు. 113 మంది విద్యార్థులు పరీక్షక్గైర్హాజరు అయ్యారు. నేటితో సైన్స్, ఆర్ట్స్ మరియు వొకేషనల్ విద్యార్థులందరికీ పరీక్షలు పూర్తి అయ్యాయి, ఒక్క లాజిక్ సబ్జెక్ట్ మాత్రమే 21 వ తేదీన ప్రథమ సంవత్సరం విద్యార్థులకు , 23 వ తేదీన ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు కదిరి పట్టణం నందు జరుగును. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి, జిల్లా పరీక్ష నిర్వహణ కమిటీ సభ్యులు, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు, సిట్టింగ్ స్క్వాడ్ సభ్యులు మరియు కస్టోడియన్ లు జిల్లాలోని వివిధ పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఎటువంటి మాల్ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డి ఐ ఈ ఓ తెలిపారు.

# నేడే తెలుగు సంవత్సరాది పరాభవనామ 'ఉగాది'

## -'ఉగాది' కొనుగోళ్లతో కిటకిటలాడిన ఉరవకొండ -పెరిగిన నిత్యావసరాలు, కూరగాయలు, పండ్ల ధరలు

ఉరవకొండ, మార్చి 18 ప్రభాతవార్త

**"చైత్రమాసి జగద్బహ్మ సపర్ణ పథమే అహని, వత్సరాదౌ సంవతాదౌ రసరాద్యే తథైవచ"**



ఉరవకొండ క్లాక్‌టవర్ కూడలిలో పండుగ కొనగోళ్ల సందడి నెలకొన్న దృశ్యం

ఈ శ్లోకం తాత్పర్యం ఏమిటంటే.. బ్రహ్మకల్పం ప్రారంభమైన మోదటి సంవత్సరం ప్రభవ. మోదటి రుతువు వసంతం, మోదటినెల చైత్రం. మోదటి తిదిపాడ్యమి. మోదటివారం గురువా రం. ఆవేళ ఈసృష్టి ప్రారంభమైందని అర్థ ం. ప్రభవించిందని అర్థం. అందుకే తెలుగు సంవత్సరాలలో మోదటిది ప్రభవ, చివరిది అక్షయ. చైత్రమాసంలో శుక్లపక్షంలో సూర్యోదయ వేళలో పాడ్యమి తిది ఉన్నరోజును ఉగాదిగా నిర్ణయిస్తారు. నేడే తెలుగుసంవత్సరాది విశ్వావసు నామ సంవత్సర 'ఉగాది' పండుగ. జీవితంలో ప్రతి మనిషికి అన్ని సుఖాలతోపాటు బాధలు, ఆనందం, కన్నీళ్ళు ఉంటాయని తెలియజేయడానికే ఈ పండుగకు తీపి, వగరు, చేదు, కారం, ఉప్పు, పులుపు ఇలా షడ్రసోపేతమైన ఉగాది పచ్చడిని చేసుకొని తినడం అనవాయితి. ఇది తెలుగువారి పండుగ కావడంతో పండుగకు పూజా సామాగ్రిని, ఇతర నిత్యావసర వస్తువులను కొనుగోలు చేసుకోవడానికి పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన వేలాది మంది ప్రజలు తరలిరావడంతో నియోజకవర్గ కేంద్రమైన ఉరవకొండ పట్టణంలోని స్థానిక బస్టాండ్, క్లాక్ టవర్, తెలుగుతల్లి విగ్రహం ప్రాంతాలు బుధవారం కిటకిటలాడా యి. మామిడాకులు, పూలు, పండ్లు, ఇతరత్రా కూరగాయలు, పూజా సామాగ్రి కొనుగోళ్లతో ఆప్రాంతంలో విపరీతమైన ఎండల దృష్ట్య ఉదయం, సాయంత్రం సమయంలో రద్దీ ఏర్పడింది. పరాభవనామ సంవత్సరంలో తొలి పండుగ కావడంతో ఈ పండుగను ఆనందోత్సాహాల మధ్య సాంప్రదాయ బద్ధంగా నిర్వహించుకోవడానికి ప్రజలు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. కాగా కూరగాయలు నుండి ఇటు నిత్యావసరాల దాక, పూజా సామాగ్రి నుండి పిండివంటల అవసరాల దాక అన్నింటి ధరలు ప్రజలను కొంత ఇబ్బందుల పాలు చేశాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బస్టాండు, క్లాక్‌టవర్, మార్కెట్ ప్రాంతాల్లో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

# ప్రజలు లేని ప్రజావేదిక

## - జీతం తీసుకుంటూ ఉద్యోగం చేస్తున్నామన్న విషయాన్ని సిబ్బంది గుర్తించుకోవాలి- పి.డి సలీం భాషా

## - తప్పులు పునరావతమవుతున్న చర్యలు శూన్యం - సామాజిక తనిఖీ ప్రజావేదికపై ప్రచారం కల్పించిన అధికారులు





పిడి సలీం భాషా ఎదుట వాగ్వాదానికి దిగిన లబ్ధిదారిని కుటుంబ సభ్యుడు శ్రీరాములు , సమావేశానికి హాజరైన ఉపాధి హామీ సిబ్బంది, డిఆర్పిలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు

వజ్రకరూరు మార్చి 18 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదిక ప్రజలు లేక వెలవెలబోయింది కేవలం ఉపాధి హామీ సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్ల సమక్షంలోనే కార్యక్రమాన్ని తూ తూ మంత్రంగా నిర్వహించారు. పదేపదే తప్పులు పునరావృతం అవుతున్న తప్పు చేసిన వారిపై చర్యలు చేపట్టకపోవడంతో సిబ్బంది ఇష్టా రాజ్యాంగ ప్రవర్తిస్తూ ప్రజాధనాన్ని ఏ విధంగా దుర్వినియోగం చేస్తున్నారనే విషయం కళ్లకు కట్టినట్టుగా డిఆర్పిలు చదివి వినిపించారు. 2024 25 ఆర్థిక సంవత్సరంకు సంబంధించి 1638 పనులకు గాను పదికోట్ల 13 లక్షల రూపాయలు ఖర్చు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇందులో వేతనాలు కింద ఏడు కోట్ల 90 లక్షల రూపాయలను, మెటీరియల్ కింద రెండు కోట్ల 26 లక్షల రూపాయలను ఖర్చు చేసినట్లు తెలిపారు. వీటికి సంబంధించి 19వ సామాజిక తనిఖీ కింద జనవరి 28 నుండి మార్చి 17 వరకు గ్రామపంచాయతీలలో ఆడిట్ ను నిర్వహించారు. ఇందులో ప్రధానంగా పాత పనులకు బిల్లులు చెల్లించడం, మాస్టర్లో సంతకాలు లేకుండానే చెల్లింపులు చేసినట్టు, ఒక్కరే అందరి సంతకాలు చేయడం, చేసిన పనుల కొలతలలో తేడాలు రావడం గుర్తించడం జరిగింది అన్నారు. లోకేషన్ కు పనులకు సంబంధం లేకుండా బిల్లులు మంజూరు చేయించారన్నారు. ఒరిజినల్ మాస్టర్లు ఇవ్వకుండా ఈ మస్టర్లను తనిఖీలకు అందజేశారన్నారు. జాబ్ కార్డ్ అప్డేషన్, సెవెన్ రిజిస్టర్స్ నిర్వహించ లేదని డిఆర్పీలు ప్రజా వేదికలో వెల్లడించారు. పనుల చేపట్టే ప్రాంతంలో కూలీలకు సౌకర్యాలు కల్పించడం లేదని మెడికల్ కిట్లు కూడా అందుబాటులో లేవని అన్నారు. ఎస్టి మెంటేషన్, తీర్మానాలు లేకుండా పనులు చేపట్టినట్లు తెలిపారు. పనులు చేపట్టిన ప్రాంతంలో నేమ్ బోర్డులను ఏర్పాటు చేయలేదన్నారు. బిల్లులు చెల్లించిన పనులకు, క్షేత్రస్థాయిలో పనులకు పూర్తి తేడా ఉందన్నారు. చాలా ప్రాంతాలలో పాత పనులకు బిల్లును చెల్లించారన్నారు. పందికుంట గ్రామంలో గోకులం షెడ్డు పూర్తిగా నిర్మించిన 80000 బిల్లు మంజూరుకు ఎం బుక్ రికార్డు చేయడంపై లబ్ధిదారిని కుటుంబ సభ్యులు శ్రీరాములు వాగ్వాదానికి దిగాడు. ఖాళీ బాండ్లపై లబ్ధిదారులు సంతకాలు తీసుకోవడం ఎందుకంటూ ఆయన ప్రశ్నించడంతో పిడి సంబంధిత తీవ్రంగా మందలించాడు. జీతం తీసుకొని పనిచేస్తున్నామనే విషయాన్ని గుర్తించుకొని జవాబిదారి గా ఉండాలని ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఎవరైనా ఆధారాలతో ఆరోపణలు చేస్తే సంబంధిత సిబ్బందిని తక్షణమే చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ప్రధానంగా కొనకొండ్ల గ్రామంలో హౌసింగ్ లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపులో తీవ్ర అన్యాయం జరగడమే గాక అక్రమాలు జరిగినట్లు గుర్తించామని డిఆర్పిలు తెలిపారు. జాబ్ కార్డు లో ఉన్న పేర్లకు కాకుండా జాబ్ కార్డుకు సంబంధం లేని వ్యక్తుల ఖాతాలలో నగదును జమ చేశారని దీనివలన నిజమైన లబ్ధిదారులకు తీవ్ర అన్యాయం జరిగిందని కొనకొండ్ల గ్రామానికి చెందిన మోహన్ రావు అనే వ్యక్తి పిడి సలీం భాషాకు ఫిర్యాదు చేసి తక్షణమే వారిపై చర్యలు చేపట్టాలని సభా దృష్టికి తీసుకువచ్చారు. పిడి ఈ విషయంపై తీవ్రంగా స్పందించారు. ఈ విషయంలో కింది స్థాయినుంచి పై స్థాయి వరకు అందరూ బాధ్యులేనని ఘాటుగా హెచ్చరించారు. రెండు లక్షల 49 వేల540 రూపాయలను రికవరీకిఆదేశించినట్లు, లక్ష 30 వేల500 రూపాయలనుజరిమానా విధించినట్లు, 27 లక్షల 83 వేల,138 రూపాయలను ఏపీ డి విచారణకు ఆదేశించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డి వివో శ్రీనివాసులు, అడిషనల్ పిడి సుధాకర్ రెడ్డి, ఏపీవోలు విమల, లక్ష్మీకాంతా భాయి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాపునాడు మండల అధ్యక్షులుగా జయన్న

అగళి, మార్చి 18 ప్రభాతవార్త



మండల కాపునాడు అధ్యక్షులు జయన్న

కాపునాడు అగళి మండల అధ్యక్షులుగా జయన్నను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాపునాడు జిల్లా అధ్యక్షులు ఇటికింటి మహేష్, కాపునాడు రాయలసీమ అధ్యక్షులు పూల పాండురంగ, ఈ నియామకాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా కాపునాడు రామాంజినేయులు మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో బలిజలకు అధిక సీట్లకు కృషి చేస్తామని, వారిని గెలిపించడానికి కృషి చేస్తామని తెలిపారు. శ్రీ కృష్ణదేవరాయ జయంతిని అధికారికంగా నియమించడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని, పేద విద్యార్థి చదువులకు ఆదుకుంటామని, బలిజల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని, నూతనంగా బలిజ సంఘం అధ్యక్షునిగా ఎన్నికైన జయన్న తెలిపారు. నాపై విశ్వాసం ఉంచి మండల అధ్యక్షునిగా ఎన్నిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

# పరిశుభ్రత తోనే ప్రజారోగ్యం, ప్రతి గ్రామం స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దాలి:

## నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు

తాడిమర్రి, మార్చి 18 (ప్రభాతవార్త)



స్వచ్ఛ రథాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న హరీష్ బాబు,దేవర రామ్మోహన్

పరిసరాల పరిశుభ్రత మరియు వ్యక్తిగత పరిశుభ్రత తో ప్రజలు ఆరోగ్యంగా జీవిస్తారని చెత్తను పారద్రోలి స్వచ్ఛతను కాపాడాలని తద్వారా ప్రతి గ్రామం స్వచ్ఛ గ్రామంగా మారుతుందని నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం కూటమి ప్రభుత్వం, పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన స్వచ్ఛరథం వాహన కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ రాష్ట్రాన్ని పరిశుభ్రంగా మార్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ రథాలను లాంచనంగా ప్రారంభించడం జరిగిందని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు పరిశుభ్రతే ప్రాముఖ్యత అని, మన పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణం సాధ్యమవుతుందని అన్నారు. ప్రజల్లో శుభ్రతపై అవగాహన పెరగడంతో పాటు, వారు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకట రంగారావు, డిప్యూటీ ఎంపీడీఓ విజయ్ శేఖర్ నాయుడు, మండల అడ్మినిస్ట్రేషన్ అధికారి సురేష్ రెడ్డి, ప్రతాప్, సర్పంచ్ బండారు బాలమ్మ, బిజెపి మండల అధ్యక్షులు దేవర రామమోహన్, వైస్ ఎంపీపీ కృష్ణం నాయుడు, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు గోవిందు గంగలప్ప, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ రామాంజనేయులు, తో పాటుస్థానిక ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వ పాలన

## - ఉరవకొండలో జరిగిన 'ద్వివ్యాంగ శక్తి' ప్రారంభోత్సవంలో వక్తలు - హాజరైన ప్రత్యేక అధికారి, వివిధ సంస్థల ఛైర్మెన్లు, కూటమి నాయకులు



ఉరవకొండలో దివ్యాంగ శక్తి ప్రారంభిస్తున్న నియోకవర్గ ప్రత్యేక అధికారి టి.పద్మావతి, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు

ఉరవకొండ, మార్చి 18 ప్రభాతవార్త

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలన కొనసాగుతోందని వక్తలు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం, వారి సహాయకులకు టికెట్టు ధరలో 50శాతం రాయితీ సౌకర్యం కల్పించేందుకు తీసుకొచ్చిన దివ్యాంగ శక్తి ప్రారంభోత్సవం బుధవారం పట్టణంలోని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో అట్టహాసంగా జరుగగా నియోజకవర్గ ప్రత్యేక అధికారి, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ టి.పద్మావతి, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ నరిశెటి విజయభాస్కర్, పీఏసీఎస్ ఛైర్మెన్ ప్యారం కేశవానంద, పెన్నహోబిళం లక్ష్మినరసింహస్వామి ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ రేగటి నాగరాజు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరుకాగా ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.హంపన్న అధ్యక్షత వహించారు. తొలుత ప్రత్యేకంగా ముస్తాబు చేసిన ఆర్టీసీ పల్లెవెలుగు బస్సును రిబ్బన్ కత్తిరించి దివ్యాంగ శక్తిను ప్రారంభించి అందులో దివ్యాంగులను ఎక్కించి వారితో కలిసి అధికారులు, నాయకులు ప్రయాణించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలన్నింటితోపాటు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఇప్పటికే ఆర్టీసీ బస్సులో స్త్రీశక్తి పథకం ప్రారంభించి మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యంను అందుబాటులోకి తీసుకురాగా నేడు దివ్యాంగ శక్తితో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి వచ్చిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేదల పక్షపాతి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు మాదినేని రామాంజినేయులు, మండల కార్యదర్శి మోపిడి గోవిందు, పార్టీ నాయకులు యర్రగుంట్ల వెంకటేష్, నెట్టం రాంబాబు, యేళ్లత్తిమ్మప్ప, పి.రాజేష్, నెట్టం బోస్, ఎం.వరప్రసాద్, ఎం.రామాంజినేయులు, ఇంద్రావతి ఓబులేసు, సుధాకర్, బోయ సుంకన్న, టి.రామాంజినేయులు, బి.ఎం.శివకుమార్, బీజేపీ నాయకుడు ధనుంజయ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగ శక్తి పథకాన్ని ప్రారంభించిన నారాయణస్వామి





పథకాన్ని ప్రారంభిస్తున్న నారాయణస్వామి

గుంతకల్లు, మార్చి 18 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దివ్యాంగ శక్తి పథకాన్ని ఎమ్మెల్యే సోదరుడు, మండల ఇన్‌చార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి బుధవారం ఆర్టిసి బస్టాండు ప్రాంగణంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది డిసెంబర్ 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నాడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట మేరకు పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 40 శాతానికి పైగా వైకల్యం ఉన్న దాదాపు 12.66 లక్షల మంది దివ్యాంగులకు ఈ పథకం ఉపయోగపడుతుందన్నారు. అంతేకాకుండా వారి వెంట వెళ్లే సహాయకులకు కూడా ఆర్టీసి బస్సులో 50 శాతం రాయితీ లభిస్తుందన్నారు. దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటికే ఉచిత బస్సు సౌకర్యం ద్వారా మహిళలు లబ్ధి పొందుతున్నారన్నారు. ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేపస్తోందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు దివ్యాంగులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, ఎంపిడిఓ దేవదాస్, నాయకులు తలారి మస్తానప్ప, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సెల్ మెంబర్ బిఎస్ కృష్ణారెడ్డి, నాయకులు పాల మల్లికార్జున, కౌన్సిలర్ ఉడుదాల ప్రభాకర్, మైనార్టీ నాయకులు గుజరి మహమ్మద్‌ఖాజా, ఫ్రూట్ మస్తాన్, ఆటో ఖాజా, ఫజులు, తదితరులు పాల్గొన్నారు.

# గుత్తి ఆర్ఎస్‌లో విద్యార్థి అదృశ్యం

గుత్తి, మార్చి 18 ప్రభాతవార్త



అదృశ్యమైన విద్యార్థి (ఫైల్‌ఫోటో)

గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని గుత్తి ఆర్ఎస్‌లో రోహిత్‌కుమార్ (14) అనే విద్యార్థి మంగళవారం రాత్రి అదృశ్యమైనట్లు తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. హోరేబ్ చర్చి ప్రాంగణంలో నివాసముంటున్న రంగాదేవి, రాజేష్‌కుమార్‌ల కుమారుడైన రోహిత్‌కుమార్ 7వ తరగతి చదువుతున్నాడు. బాలుడికి టమోటా తెచ్చి ఇవ్వమని తల్లి చెప్పగా, తెచ్చి ఇచ్చిన పిమ్మట తాను రాలేదు. అన్నిచోట్ల వాకబు చేసినప్పటికీ ఆచూకీ తెలియక పోవటంతో వారు పోలీసులను ఆశ్రయించారు. విద్యార్థి వివరాలు తెలిసినవారు సిఐ సెల్ 9346010582, ఎస్ఐసెల్ 9346917082కు సమాచారం అందించాలని ఎస్ఐసురేష్‌బాబు తెలిపారు. అయితే బాలుడుకర్నూల్‌లో వున్నట్లు సమాచా రం. చదువుకోకుండా టివి అధికంగా చూస్తుండడంతో తల్లి మందలించడంతో ఆ బాలుడు మనస్థాపంతో ఇళ్లు విడిచి వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ మేరకు బాలున్ని గుత్తికి చేర్చేందుకు తగు చర్యలు తీసుకున్నారు.

# ఉగాది వేడుకలకు వచ్చి విజయవంతం చేయండి

## - ఈనెల 20న రేణుక ఎల్లమ్మ దేవస్థానం వద్ద రాతిదూలం లాగుడు పోటీలు - మంత్రిని ఆహ్వానించిన....టిడిపి సీనియర్ నేత నిమ్మల శ్రీధర్



మంత్రికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న నిమ్మల శ్రీధర్

గోరంట్ల, మార్చి 18 ప్రభాతవార్త

ఉగాది పురస్కరించుకొని ఈనెల 20వతేదీ శుక్రవారం పట్టణంలోని గంగంపల్లి రోడ్డులో గల రేణుక ఎల్లమ్మ దేవస్థానం ఆవరణలో భారీ ఎత్తున రాతిదూలం లాగుడుపోటీలు నిర్వహిస్తున్నట్లు ఆకార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించాలని మంత్రి సవితమ్మను నిర్వాహకులు టిడిపి మండల సీనియర్ నాయకులు, నిత్యశ్రీ గోల్డ్‌షాప్ యజమాని నిమ్మల శ్రీధర్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా నిమ్మల శ్రీధర్ మాట్లాడుతూ ఉగాదిపండుగఅంటేనే హిందూసాంప్రదాయానికి నిలువెత్తు నిదర్శనమని నూతన సంవత్సరానికి నాంది అని అలాంటి నేపథ్యంలో ఈ ఎద్దుల పోటీల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి బహుమతిగా 30 వేలు, రెండవ బహుమతిగా 20 వేలు, మూడవ బహుమతిగా 10వేలు చొప్పున విజేతలకు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

# నేడు చోళసముద్రంలో చౌడేశ్వరిదేవి రథోత్సవం

లేపాక్షి, మార్చి 18 ప్రభాతవార్త



చౌడేశ్వరిదేవి అమ్మవారు

మండల పరిధిలోని చోళసముద్రం గ్రామంలో వెలిసిన చౌడేశ్వరిదేవి బ్రహ్మోత్సవాలకు రంగం సిద్ధమైంది. శ్రీకృష్ణదేవరాయలు కాలంలో నిర్మితమైన ఈ పురాతన ఆలయంలో గురువారం నుండి రెండు రోజులపాటు ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి గణపతి పూజ, పుణ్యాహవాచనం, చండీ హోమం వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం మధ్యాహ్నం 1 గంటకు అమ్మవారి బ్రహ్మరథోత్సవం కన్నులపండువగా జరగనుంది. సాయంత్రం 6గంటలకు పల్లకీసేవ, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం ఉంటుంది. 20వ తేదీ శుక్రవారం రాత్రి 7 గంటలకు ముత్యాల పల్లకీ ఉత్సవం నిర్వహించనున్నారు. గ్రామ వీధుల్లో కీలుగుర్రాలు, మేళతాళాలు, మంగళవాయిద్యాలమధ్య అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. లేపాక్షి ఆలయచైర్మన్ కరణంరామానందన్ దంపతుల ఆర్థికసహకారంతో పాటు చోళసముద్రం, కోడిపల్లి గ్రామస్తుల సమన్వయంతో ఈ వేడుకలు జరుగుతున్నాయి. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ వారు కోరారు.

# రైల్వే భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వండి..

**గుంతకల్ రైల్వే మార్చి 18 : ప్రభాత వార్త :** గుంతకల్ రైల్వే డివిజన్‌లో రైల్వే మేనేజర్ చంద్ర ఎస్ గుప్తా సంబంధిత అధికారులతో కలిసి గుంతకల్‌లోని పాయింట్ నెం. 87ఎ వద్ద ఉన్న పాయింట్లు మరియు క్రాసింగ్‌లను తనిఖీ చేశారు. ఈ తనిఖీ సందర్భంగా, డి.ఆర్.ఎం. షెడ్యూల్డ్ నిర్వహణ కార్యకలాపాలు మరియు ఉమ్మడి తనిఖీ విధానాలను సమీక్షించారు. నిర్దేశించిన చెక్‌లిస్ట్ ప్రకారం అన్ని షరతులు నెరవేరుతున్నాయని నిర్ధారించుకుంటూ, క్షుణ్ణమైన తనిఖీలు చేయవలసిన అవసరాన్ని అధికారులకు తెలిపారు . ఇటువంటి తనిఖీల యొక్క ప్రాథమిక లక్ష్యం ట్రాక్ యొక్క భద్రతా అంశాలను మరియు ఫిట్‌నెస్‌ను నిర్ధారించడమేనని డి.ఆర్.ఎం. పునరుద్ఘాటించారు. తనిఖీల భాగంగా వీరితోపాటు రైల్వే అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

09ATP27_09ATP27.qxd 18-03-2026 PM 11:58 Page 1



## ప్రభుత్వ కళాశాల బాలుర వసతిగృహంలో అపరిశుభ్రత

- కంపు కొడుతున్న మరుగుదొడ్లు, స్నానాల గదులు
- వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని ఏఐఎఫ్‌డీఎస్ డిమాండ్



పట్టణంలోని సాంఘిక సంక్షేమశాఖ ప్రభుత్వ కళాశాల బాలుర వసతిగృహంలో మరుగుదొడ్డి, స్నానాల గది అపరిశుభ్రంగా ఉన్న దృశ్యాలు

**ఉరవకొండ, మార్చి 18 ప్రభాతవార్త**

ఉరవకొండ పట్టణంలోని సాంఘిక సంక్షేమశాఖ ప్రభుత్వ కళాశాల బాలుర వసతిగృహంలో అపరిశుభ్రతతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అయినా స్పందించని వార్డెన్ షరీఫ్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర అధ్యక్షులు సి.ఎం.సిద్ధు, జిల్లా అధ్యక్షుడు నందు డిమాండ్ చేశారు. బుధవారం వారు హాస్టల్‌ను సందర్శించిన అనంతరం స్థానిక విలేఖరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ వసతిగృహాలు శుభ్రంగా ఉండేలా చూడాలని, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని పదే పదే చెబుతున్నా హాస్టల్ వార్డెన్ పట్టించుకోవడం లేదన్నారు. అత్తారింటికి పండుగలు, పబ్బాలకు వచ్చి వెళ్లినట్లు వార్డెన్ హాస్టల్‌కు వచ్చి వెళుతున్నారని ఆరోపించారు. సంక్షేమ వసతిగృహంలో మరుగుదొడ్లు, స్నానాల గదుల్లో అపరిశుభ్రత తాండవిస్తోందని కంపుకొడుతున్నాయన్నారు. జిల్లా అధికారులు స్పందించి పరిస్థితిని చక్కదిద్ది హాస్టల్‌ను సందర్శించి వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఘనంగా దుర్గమ్మ దేవి ఉత్సవాలు

**డి. హిరేహాళ్ మార్చి 18 ప్రభాతవార్త**



దుర్గమ్మదేవికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వరాభవనావు సంవత్సరం ఉగాది కొత్త సంవత్సరం వేడుకలను పురస్కరించుకొని దుర్గమ్మ అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బుధవారం డి. హిరేహాళ్ మండలం మలపనగుడి గ్రామంలో వెలిసిన దుర్గమ్మ అమ్మవారిని సమీపంలోని హెచ్ ఎస్ తండా గ్రామానికి ఆ గ్రామ అమ్మవారిని ఊరేగింపు ద్వారా తీసుకెళ్లి అమ్మవారు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సాంప్రదాయబద్ధంగా ఆనవాయితీగా వస్తున్న దుర్గమ్మ అమ్మవారి కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ రుద్రేశ్, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. హెచ్ ఎస్ తండా గ్రామంలో వెంకటేశ్వర స్వామి, సేవాలాల్ మహారాజ్ దేవాలయాల ఆవరణలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మలపనగుడి గ్రామం నుండి దుర్గమ్మ అమ్మవారిని డోలు, మేళ తాళాలు, పప్పెట్లతో ఊరేగిస్తూ తీసుకెళ్లి గ్రామంలో ఘనంగా ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. హెచ్ ఎస్ తండా గ్రామంలోని భక్తులు అమ్మవారిని పురవీధుల్లో ఊరేగిస్తూ ప్రత్యేక పూజలు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. యుగయుగాలుగా వస్తున్న ఈ సాంప్రదాయాన్ని హెచ్ ఎస్ తండా గ్రామ ప్రజలు దుర్గమ్మ అమ్మవారి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ ఊరేగింపు కార్యక్రమంలో హెచ్ఎస్ తండా గ్రామానికి చెందిన భక్తులు నర్సింగ్ నాయక్, కాషా నాయక్, చంద్రనాయక్, గౌసిద్ధ నాయక్, రమేష్, ఉపేంద్ర, సతీష్, నాగునాయక్, వెంకటేష్ నాయక్, కృష్ణానాయక్, దంజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## రీ సర్వేను పగడ్బందీగా నిర్వహించండి పెనుకొండ ఆర్డిఓ

**అమరాపురం మార్చి 18 ప్రభాతవార్త**



రీసర్వే ను పరిశీలించిన ఆర్డీవో దృశ్యం

మండల పరిధిలో బసవనపల్లి గ్రామ రెవిన్యూ పంచాయతీ పరిధిలోని ఆలదపల్లి గ్రామం వద్ద జరుగుతున్న భూముల రీ సర్వేను మడకశిర ఆర్డీవో ఆనంద్ కుమార్ బుధవారం పరిశీలించారు. స్థానిక తహసిల్దార్ లక్ష్మీనరసింహం, రెవిన్యూ ఇన్స్పెక్టర్ విన్సెంట్ పాల్, మండల సర్వేయర్ పుట్టరాజు, తదితరుల సమక్షంలో ఆర్డిఓ భూముల రీ సర్వేను పరిశీలించి పగడ్బందీగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతులకు సక్రమంగా రీ సర్వే ను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా రైతులను రీ సర్వే జరుగుతున్న తీరును ఆర్డీవో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో శివన్న, జడ్పిటిసి పి ఆర్ నరసింహమూర్తి, మాజీ సర్పంచ్ లు పాండురంగప్ప, చంద్రప్ప, టిడిపి పంచాయతీ కన్వీనర్ ఎంజారప్ప, మరియు రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించి కేసులు నమోదుచేయండి

**ధర్మవరంటౌన్ , మార్చి 18 ప్రభాతవార్త**

బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య తెలిపారు. బుధవారం ఆయన ధర్మవరం ఎక్సైజ్ శాఖ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా స్టేషన్ రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఎక్సైజ్ ఏపీ సురక్షయాప్ ద్వారా ప్రతిషాపులో ప్రతిబాటిలను స్కాన్ చేసి అమ్మకాలు జరపాలన్నారు. అదేవిధంగా ఎక్సైజ్ నేరాలు చేసే వ్యక్తులను, పాత నేరస్థులను బైండోవర్ కేసులు నమోదు చేయాలన్నారు. అంతేకాకుండా ప్రతిషాపులో ఎమ్మార్పీ ధరకే అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ సీఐ చంద్రమణి తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రప్పాదొడ్డిలో త్రాగునీటి సమస్యను పరిష్కరించిన శాసనసభ్యులు

**బ్రహ్మసముద్రం మార్చి 18 ప్రభాతవార్త**



ట్రాన్ఫార్మర్ బిగిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం మండలం ఎర్రప్ప దొడ్డి గ్రామము నందు గత కొన్నిరోజులుగా త్రాగునిటీబోరుకి విద్యుత్ సరఫరా లేక త్రాగునీటి సమస్య ఉన్నందున కళ్యాణ దుర్గం శాసన సభ్యులు అ మిలినేని సురేంద్రబాబు ఫోన్ నందు సంప్రదించి త మయొక్క సమస్య ను తెలుపడంతో విద్యుత్ అధికారులలో సంప్రదించి తక్షణ ౖ ట్రాన్స్ఫార్మర్ భిగించి మోటర్ కు విద్యుత్ సరఫరా చేయించి ఎర్రప్ప దొడ్డి గ్రామస్తులయొక్క దాహర్తిని తీర్చిన సురేంద్రగారిని కోయాడా రుఈసందర్భంగా వారు ప్రసంగిస్తు బాబు చెప్పింది చేస్తాడని తెలియచేసారు ఈ కార్యక్రమం లో సన్నప్ప. తిప్పేస్వామి డీలర్ క్రిష్ట ప్ప తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ పి గ్యాస్ సిలిండర్ గోడన్ పరిశీలించిన ఆర్డీవో

**అమరాపురం మార్చి 18 ప్రభాతవార్త**



గోడౌన్ ను పరిశీలిస్తున్న ఆర్డీవో దృశ్యం

మండల పరిధిలోని ఆలదపల్లి గ్రామ సమీపంలో ఉన్న హెచ్ పీ గ్యాస్ గోడన్ ను మడకశిర ఆర్ డి ఓ ఆనంద్ కుమార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గోడన్ లో గ్యాస్ సిలిండర్లను పరిశీలించడంతోపాటు స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక తహసిల్దార్ లక్ష్మీనరసింహం సమక్షంలో పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీ సాయి దుర్గ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు జిబి శివకుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం గ్యాస్ సిలిండర్లు స్టాక్ లేదని ప్రస్తుతం లోడ్‌వస్తున్నట్లు తెలియజేశారు. వచ్చిన తక్షణం ప్రతిఒక్క వినియోగదారులకు సక్రమంగా అందించాలని ఆర్డీవో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఇన్స్పెక్టర్ విన్సెంట్ పాల్, గ్యాస్ ఆఫీస్ మేనేజర్ కరుణాకర్, స్థానిక విఆర్ఓ శివన్న, పాండురంగప్ప తదితరులు పాల్గొన్నారు.

## భారీ గాలివానకు విద్యుత్ స్తంభం పైకి ఎగిరిన రేకు

**అమరాపురం మార్చి 18 ప్రభాతవార్త**



గాలివానకు ఎగిరిన రేకు షెడ్డు దృశ్యం

మండల కేంద్రమైన అమరాపురం పట్టణంలో మడకశిర ప్రధాన రహదారి వ్యవసాయ సహకార సంఘం కార్యాలయ ముందు ఉన్న బాగులారు చిక్కన్న వారీ షాపుల ముందు భాగంలో ఏర్పాటుచేసిన భారీ రేకుల షెడ్డు గాలివానకు ఎగిసిపడి షాపుల ముందు భాగంలో ఉన్న విద్యుత్ స్తంభంపైపడినది. అయితేసకాలంలో విద్యుత్ అధికారులు ఏఈ సిద్దేశ్వర, పట్టణ లైన్మెన్ జయకుమార్లు అప్రమత్తమై విద్యుత్తు సప్లైని నిలిపివేసి ఇనుపు రేకును తొలగించడానికి సహకరించారు. ఏలాంటి అపాయం జరగకుండా తక్షణం చొరవ చూపడం పట్ల ప్రజలు విద్యుత్ అధికారులకు అభినందనలు తెలిపారు. అనంతరం షాపుల యజమానులు భారీ రేకుల షెడ్డు ను తొలగించేశారు.

## ఆటో కార్మికుడికి ఆర్థికసాయం

**ధర్మవరంటౌన్ , మార్చి 18 ప్రభాతవార్త**



బాధితునికి ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

పట్టణ సమీపంలోని తుంపర్తికాలనీకి చెందిన ఆటో కార్మికుడు షెక్షావలికి పరిటాల అభిమానులు ఆర్థిక సాయం అందజేశారు. షెక్షావలి గత ఆరునెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ మంచానికి పరిమితమయ్యాడు. దీంతో స్పందించిన పరిటాల అభిమానులు తన స్నేహితులతోకలిసి విరాళాలు సేకరించి వచ్చిన రూ.14వేలు నగదును బుధవారం షేక్షావలి ఇంటికి వెళ్లిఅందజేశారు.

## టౌన్‌లో రైతన్న మీ కోసం కార్యక్రమం

**కణేకల్ మార్చి 18 ప్రభాతవార్త :**



పట్టణంలో నిర్వహించిన 'రైతన్న మీ కోసం' కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చాంద్ బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులతో సమావేశమైన ఆయన వారి సమస్యలు, పంటల దిగుబడి, మార్కెట్‌లో ఎదురవుతున్న ఇబ్బందులపై వివరాలు తెలుసుకున్నారు. రైతులకు న్యాయమైన ధరలు లభించేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. మార్కెట్ యార్డులో మౌలిక వసతుల మెరుగుదలకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో ఎలాంటి లోపాలు లేకుండా అధికారులు పని చేయాలని సూచించారు. వ్యవసాయ రంగ అభివృద్ధికోసం రైతులు ఆధునికపద్ధతులను అనుసరించాలని, అందుబాటులో ఉన్న సబ్సిడీలు, పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చాంద్ బాషా సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కార్యక్రమం ద్వారా రైతుల సమస్యలకు పరిష్కార మార్గాలు కనుగొనే దిశగా చర్చలు జరిగాయి.

## శ్రీ చైతన్య లో ఘనంగా ముందస్తు ఉగాది సంబరాలు

**కళ్యాణదుర్గం ,టౌన్ మార్చి 18, ప్రభాతవార్త**



పాఠశాలలో ఉగాది సంబరాలు నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం జోన్ ఏజిఎం సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు స్థానిక కళ్యాణదుర్గం పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నో పాఠశాలలో బుధవారం ముందస్తు ఉగాది సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఫిలిప్ కుమార్ మాట్లాడుతూ ఉగాది అంటే యుగ ఆరంభం అని అర్థం కావున కొత్త పనులు ప్రారంభించడానికి ఇంట్లో పూజలు ఇంటికి తోరణాలు కట్టి ఉగాది ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటారాన్నారు. తెలుగువారి సాంప్రదాయ నూతన సంవత్సరాది. సృష్టికర్త అయిన బ్రహ్మదేవుడు ఈరోజునే సృష్టిని ప్రారంభించాడని వసంత రుతువు ప్రారంభమవుతుందనే నమ్మకమని తెలిపారు. ఇది షడ్రచుల తీపి, పులుపు, కారం, ఉప్పు, చేదు, వగరు సమ్మేళనంతో పచ్చడి సేవించడం పంచాంగ శ్రవణం వినడం ద్వారా జీవితంలో కష్టసుఖాలను సమానంగా స్వీకరించాలని బోధిస్తుందన్నారు .ఉగాది ప్రాముఖ్యతను గురించి తెలియజేసి పాఠశాల విద్యార్థులకు కళ్యాణదుర్గం ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశాడు. ఉగాది సంబరాల వలన పాఠశాల ప్రాంగణ మంతా పండుగ వాతావరణం నెలకొందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఫిలిప్ కుమార్, డీన్ తిప్పారెడ్డి, ప్రైమరీ ఇన్చార్జి లీలావతి ప్రీ ప్రైమరీ ఇన్చార్జి హేమలత పి ఈ టి లు అశోక్ ,హరి మరియు డాన్స్ మాస్టర్ రామకృష్ణ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

### 31న ఉరవకొండ గవిమఠంలో ఉచిత గుండె వైద్య శిబిరం

**ఉరవకొండ, మార్చి 18 ప్రభాతవార్త**

భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నేత, దివంగత కామ్రేడ్ ఛాయాపురం తమ్మినేని రంగన్న 8వ వర్ధంతి సందర్భంగా ఉరవకొండ పట్టణంలోని గవిమఠంలో ఈనెల 31వ తేదీన మంగళవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాన్నం 2 గంటల వరకు కిమ్స్ సవేరా ఆసుపత్రిచే ఉచిత గుండె వైద్య శిబిరం జరుగుతుందని నిర్వాహకులు బుధవారం తెలిపారు. ఈ వైద్య శిబిరంలో జి.ఆర్.బి.యస్, బి.పి, ఇ.సి.జి, 2డి ఎకో పరీక్షలను నిర్వహించడం జరుగుతుందన్నారు. గుండె నొప్పి/ఛాతి నొప్పి, గుండె దడ, ఆయాసం, కళ్ళు తిరగడం, గుండెలో మంట కలుగటం, ఛాతిలో బరువుగా ఉండటం, నిద్రలో ఆయాసం వచ్చి లేచి కూర్చోవడం, కాళ్ళు వాపురావడం, చమటలు పట్టడం లాంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## తహశీల్దార్ కార్యాలయంలో నీటి చలివేంద్రం ప్రారంభం

- ప్రజల దాహార్తి తీర్చడానికేనన్న తహశీల్దార్ పాటిల్ భోగనగౌడ్

**ఉరవకొండ, మార్చి 18 ప్రభాతవార్త**





తహశీల్దార్ కార్యాలయంలో నీటి చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహశీల్దార్ పాటిల్ భోగనగౌడ్

ఉరవకొండ పట్టణంలో మండల తహశీల్దార్ కార్యాలయంలో నీటి చలి వేంద్రాన్ని బుధవారం తహశీల్దార్ పాటిల్ భోగనగౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజల సౌకర్యార్థం వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకొని ఈ నీటి చలివేంద్రాన్ని ప్రారంభించామన్నారు. చలి వేంద్రంలో కార్యాలయ పనివేళల్లో స్వచ్ఛమైన నీటిని అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ టి.రామకృష్ణ, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీనరసింహస్వామి విగ్రహ ప్రతిష్టాపనోత్సవానికి ఇంటింటికీ ఆహ్వానం

- మాజీ సర్పంచ్ బోదపాటి గోవిందప్ప ఆధ్వర్యంలో స్వామివారి చిత్రపటం, ప్రసాదం పంపిణీ

**ఉరవకొండ, మార్చి 18 ప్రభాతవార్త**



గ్రామంలో ఇంటింటికీ ఆహ్వాన పత్రికలు అందించడానికి ర్యాలీ వెళుతున్న దృశ్యం

మండల పరిధిలోని లత్తవరం గ్రామంలో ఈనెల 31వ తేదీ, ఏప్రిల్ 1,2 తేదీల్లో జరిగే కొండపై వెలసిన లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వామివార్ల విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలకు గ్రామంలో ఇంటింటికీ ఆహ్వాన పత్రికలను బుధవారం పంపిణీ చేశారు. గ్రామ మాజీ సర్పంచ్ బోదపాటి గోవిందప్ప, స్థానికులు కొర్రపాటి మల్లికార్జున ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ఆహ్వాన పత్రికలతోపాటు నరసింహస్వామి చిత్రపటం, అన్నమయ్య లడ్డూ ప్రసాదం అందించారు. విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి అందరూ హాజరై జయ ప్రదం చేయాలని ఆహ్వానించారు. ఇప్పటికే కొండపైకి నూతన రోడ్డు నిర్మాణ పనులు బోదపాటి గోవిందప్ప ఆధ్వర్యంలో ప్రారంభమై చురుగ్గా జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడిగా తగ్గుపర్తి చందు

- విశాఖపట్టణంలో జరిగిన రాష్ట్ర సమితి సమావేశాల్లో ఎన్నిక

**ఉరవకొండ, మార్చి 18 ప్రభాతవార్త**



తగ్గుపర్తి చందు

అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర సమితి సభ్యుడిగా తగ్గుపర్తి చందు ఎన్నికయ్యారు. మంగళవారం విశాఖపట్టణంలో జరిగిన సమాఖ్య రాష్ట్ర సమితి సమావేశంలో ఉరవకొండ నియోజకవర్గానికి చెందిన తగ్గుపర్తి చందును రాష్ట్ర సమితిలోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా తగ్గుపర్తి చందు మాట్లాడుతూ తనపై నమ్మకముంచి రాష్ట్ర సమితి సభ్యునిగా ఎన్నుకున్నందుకు రాష్ట్ర సమితి బాధ్యులతోపాటు జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయిస్వామి, జిల్లా బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై రానున్న రోజుల్లో సమరశీల పోరాటాలకు సన్నద్ధమవుతామన్నారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి, ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడికి వ్యతిరేఖంగా, కూటమి నేతలు ఎన్నికల సమయంలో యువకులు, విద్యార్థులకు ఇచ్చిన హామీల అమలు కోసం దశలవారి ఉద్యమాలు చేపడుతామని పేర్కొన్నారు.

## రూ.8 లక్షలతో ఈద్గాలో అభివృద్ధి పనులు పరిశీలించిన టిడిపి నేత దేవినేని ధర్మతేజ

**కళ్యాణదుర్గం మార్చి 18 ప్రభాతవార్త**



ఈద్గాలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న దృశ్యం

ముస్లిం సోదరులు అత్యంత భక్తి బావంతో జరుపుకునే రంజాన్ వేడుకల కోసం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు 8 లక్షల రూపాయల స్వంత నిధులతో సర్వాంగా సుందరంగా ఈద్గా మైదానాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేశారు. ఇందులో భాగంగా ఈద్గాలో జరుగుతున్న అభివృద్ధి పనులను, స్థానిక ముస్లిం సోదరులతో కలసి టీడీపీ నాయకుడు దేవినేని ధర్మతేజ బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగ ముగింపు రోజున ఈద్గాలో ముస్లిం సోదరులు ప్రార్థనలు చేసుకోవడానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని నాయకులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు జియావుద్దీన్, జిల్లా పార్లమెంటరీ కమిటీ కార్యదర్శి షామీర్, మాజీ మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ రెహమాన్, పలువురు ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

## 10వ తరగతి పరీక్షా కేంద్రాలపై తహశీల్దార్ తనిఖీలు

**కణేకల్లు మార్చి 18 ప్రభాతవార్త :**



గ్రామంలో నిర్వహిస్తున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షల సందర్భంగా స్థానిక తహశీల్దార్ బ్రహ్మయ్య బుధవారం పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షా నిర్వహణ విధానం, కేంద్రాలలో ఏర్పాటు చేసిన మౌలిక వసతులు, భద్రతా చర్యలను ఆయన సమగ్రంగా పరిశీలించారు. పరీక్షా హాళ్లలో విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాస్తున్నారా అనే విషయాన్ని పరిశీలించడంతో పాటు, ప్రశ్నాపత్రాల పంపిణీ, సమాధాన పత్రాల సేకరణ విధానాలను కూడా పరిశీలించారు. అదేవిధంగా, ఎలాంటి అవకతవకలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైనచర్యలు తీసుకోవాలనిఅధికారులకు సూచించారు. విద్యార్థులకు తాగునీరు, కూర్చోవడానికి సరైన సదుపాయాలు, విద్యుత్ సరఫరా వంటి ప్రాథమిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయా అనే విషయాన్ని కూడా ఆయన తెలుసుకున్నారు. ఎక్కడైనా లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని సిబ్బందిని ఆదేశించారు. పరీక్షలు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా, ధైర్యంగా పరీక్షలు రాయాలని సూచించారు. ఈ తనిఖీలతో పరీక్షా కేంద్రాల్లో నిర్వహణపై మరింత క్రమశిక్షణ నెలకొంది.

## పదవ తరగతి పరీక్షకు 22 మంది విద్యార్థుల గైర్హాజరు

- సజావుగా కొనసాగిన సెకెండ్ లాంగ్వేజ్ హిందీ పరీక్ష



ఎస్.కె.ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంవద్ద విద్యార్థుల సందడి

**ఉరవకొండ, మార్చి 18 ప్రభాతవార్త**

పదవ తరగతి పరీక్షల్లో భాగంగా బుధవారం జరిగిన సెకెండ్ లాంగ్వేజ్ హిందీ పరీక్షకు 22 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని మండల విద్యాధికారి హెచ్.ఈశ్వరప్ప తెలిపారు. సెకెండ్ లాంగ్వేజ్ హిందీ పరీక్షకు 5 సెంటర్లకుగాను 1,100 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 22 మంది గైర్హాజరుకాగా 1,078 మంది హాజరయ్యారు. స్థానిక ఎస్.కె.ప్రభుత్వ ఉన్నతపాఠశాల పరీక్షాకేంద్రంలో (కోడ్:65073)250మంది విద్యార్థులకుగాను ఇద్దరు గైర్హాజరుకాగా 248 మంది హాజరయ్యారు. జిల్లా పరిషత్ సెంట్రల్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో (కోడ్: 65074) 250 మంది విద్యార్థులకుగాను ఏడుగురు గైర్హాజరుకాగా 243 మంది హాజరయ్యారు. జెడ్పీ బాలికోన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో (కోడ్: 65075) 246 మంది విద్యార్థులకుగాను నలుగురు గైర్హాజరుకాగా 242 మంది హాజరయ్యారు. వివేకానంద ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ పరీక్షా కేంద్రంలో (కోడ్: 65076) 249 మంది విద్యార్థులకుగాను ఐదుగురు గైర్హాజరుకాగా 244 మంది హాజరయ్యారు. ఏవీఆర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల పరీక్షా కేంద్రంలో (కోడ్: 65077) 105 మందికిగాను నలుగురు గైర్హాజరుకాగా 101 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎంఈవో వివరించారు.

## లాంఛనాలతో అమర జవాన్‌కు అంత్యక్రియలు



జవాన్ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

**గుత్తి, మార్చి 18 ప్రభాతవార్త**

మండలంలోని శ్రీపురం గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ ఆంజనేయులు మృతదేహానికి బుధ వారం సాయంత్రం లాంఛనంగా అంత్య క్రియలు నిర్వహించా రు. ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ రెజిమెంట్‌కు చెందిన ఆర్మీ అధికారులు గ్రామంలో జరిగిన అంత్యక్రియలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మృతదేహానికి పూలమాలలు, పుష్పగుచ్ఛాలు సమర్పించి ఘనంగానివాళులర్పించారు. ఆయన మృతిపట్ల మౌనంగా సంతాపం వ్యక్తంచేస్తూ నివాళులుఅర్పించారు. అనంతరం ఆయన అంత్యక్రియలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆర్మీ అధికారులు సుబేదార్ ఉపేంద్రసింగ్, ప్రతాప్‌సింగ్, హవల్దార్ గురుప్రసాద్, విటల్ సూర్యవంశి, ఐఎన్‌రెడ్డి స్థానిక ఏఎస్ఐ రామాంజనేయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రంజాన్ కానుకగా సొంతూర్ జనానికి ఉమర్ సాయం

- సిఐ బోయ శేఖర్ చేతుల మీదుగా 500 మంది పేదలకు పంపిణీ

**గోరంట్ల, మార్చి 18 ప్రభాతవార్త**



సిఐ చేతుల మీదుగా సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

పవిత్ర వైన రంజాన్ పండుగను పురస్కరించుకొని గోరంట్ల మండల తెలుగుదేశం పార్టీ మైనార్టీ లీడర్ ఉమర్‌ఖాన్ తన వంతు బాధ్యతగా 500 మంది పేద ప్రజలకు ఇఫ్తార్ సరుకులు అందజేసి తన మానవత్వాన్ని చాటుకున్నాడు. మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద బుధవారం స్థానిక సిఐ బోయ శేఖర్ చేతుల మీదుగా ఉమర్‌ఖాన్ ఇంటి వద్ద పేదలకు నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిక్రియా ఖాన్, ఫయాజ్, ఫిరోజ్, జావిద్, షఫీ, తాయూబ్, తబ్రేజ్, తదితరులు పాల్గొన్నారు.

## డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంపై అవగాహన

**గుంతకల్లు, మార్చి 18 ప్రభాతవార్త**



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న మండల విద్యాధికారి సుబ్బరాయుడు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంపై బుధవారం స్థానిక సెయింట్ జోసెఫ్ చర్చి పాఠశాలలో వంట ఏజెన్సీ నిర్వాహకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారులు మస్తాన్‌రావు, సుబ్బరాయుడు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. ప్రధానంగా మధ్యాహ్న భోజనం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతం పెంచడం, ఆహార నాణ్యతను తప్పకుండా పాటించాలని పేర్కొన్నారు. వారం మొత్తం వేరువేరు వంటకాలతో కూడిన భోజనాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. ఏజెన్సీలపై ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.

## ఇరువురు రైల్వే సిబ్బందికి తీవ్రగాయాలు

**గుత్తి, మార్చి 18 ప్రభాతవార్త**



రైల్వే సిబ్బంది గాయపడిన దృశ్యం

బెంగళూరు నుండి భువనేశ్వర్ వెళ్లే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ (18464)లో ప్యాంట్రీ కార్ కోచ్‌లో ప్రమాదవశాత్తు ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. సదరు రైలులో వేడి నీరు మీద పడడంతో హెడ్ కుక్ పింటూసా, ఏసీ మెకానిక్ లాల్‌సాహెబ్‌లు తీవ్రంగా గాయపడ్డారు. రైలు స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో మలుపు వద్ద స్టవ్‌పై ఉన్న వేడి నీరు దేక్షా వారిపై పడింది. రైలు స్టేషన్ చేరగానే అధికారులు వారిని చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. తదుపరి మెరుగైనవైద్యం కోసం అనంతపురం తరలించారు. ఈ సంఘటనపై రైల్వే అధికారులు విచారణ చేపట్టారు.

